క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : ఇందిరానగర్ ఫీడర్ ప్రాంతంలో శుక్రవారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నారు. దీని పరిధిలో ఫీడర్ నిర్వహణతోపాటు చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు.

- ఆరిలోవ ప్రాంతంలో శనివారం 11 కేవీ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ పనులలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించనుండడంతో సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, శ్రీహరినగర్, రవీంద్రనగర్ – 2, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొన్ని ప్రాంతాల్లో రేపు సరఫరా నిలిపివేత

మద్దిలపాలెం : ఈపీడీసీఎల్ జోన్ – 1 మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా కళాశాల మెయిన్ రోడ్డు, ఎస్‌బీఐ, భానునగర్, యూనియన్ బ్యాంకు లైన్, కేఆర్‌ఎం కాలనీ, ఎంవీవీ బిల్డర్స్, మద్దిలపాలెం, శివాలయం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని తెలిపారు.

రామాలయంలో అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దుర్గాబజార్ ప్రాంతం వెర్నిదుర్గానగర్ రామాలయంలో దాతల సహకారంతో కమిటీ సభ్యులు గురువారం అన్నసమారాధన చేపట్టారు. దుర్గాబజార్, వెర్నిదుర్గానగర్ ప్రాంతాల నుంచి భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా దాతలు వెంకటరమణారెడ్డి, భాగ్యలక్ష్మిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పి.ఐ.బాలరాజు, సభ్యులు కిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల అప్పగింత

టీచర్‌రోడ్డు : చాలా సంవత్సరాలుగా పోలీస్‌స్టేషన్‌లో మూలకు చేరిన వాహనాలను సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం యజమానులకు అప్పగించనున్నట్లు మూడో పట్టణ సీఐ పైడయ్య తెలిపారు. ఆరు వాహనాలు కొన్నేళ్లుగా స్టేషన్‌లో ఉన్నాయని, వాటిని సంబంధిత యజమానులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌ఈవైపీ ప్రాథమిక పరీక్షలు రేపు

మద్దిలపాలెం : నేషనల్ ఎన్విరాన్మెంట్ యూత్ పార్లమెంట్ (ఎన్‌ఈవైపీ) లెవల్ - 1 (యూనివర్సిటీ స్థాయి) పోటీలు ఈ నెల 20న ఉదయం 9 గంటలకు ఏయూ సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో నిర్వహించనున్నట్లు విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఏయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉష మాధురి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రాథమిక పరీక్షలో ఎంపికైన పది మంది విద్యార్థులను ప్రాంతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

ఏటీఎల్‌తో సృజనాత్మకత

సింహాచలం: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం పెరుగుతోందని ఏపీ యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ తెలిపారు. వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో జిల్లాలోని 9 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జ్‌లతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎల్‌లు విద్యార్థులను భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా మారేందుకు ఎంతగానో దోహపడతాయన్నారు. ఎయిమ్ పోర్టల్ గురించి తెలిపి, నెలవారీ కార్యక్రమాలను వివరించారు. విశాఖ జిల్లా సైన్స్ అధికారి(డీఎస్‌వో) రాజారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఒక ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ రూపొందించి, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలని సూచించారు.



కల్వర్టు నిర్మాణ పనుల కోసం సగం వరకు తవ్వేసిన జాతీయ రహదారి



కల్వర్టు నిర్మాణ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య కారణంగా నిలిచిపోయిన వాహనాలు

ఇసుకతోట హైవేపై... ట్రాఫిక్ హైరానా

- ఇసుకతోట కూడలిలో నత్తనడకన కల్వర్ట్ నిర్మాణ పనులు
- జాతీయ రహదారిపై వాహనదారులకు నిత్యం నరకయాతన
- రహదారికి సగం వరకు గొయ్యి తవ్వేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు
- రూ.90 లక్షలతో 2 భాగాలుగా పనులు అప్పగించిన జీవీఎంసీ
- కనీస భద్రత పాటించని విశాఖ ఇంజినీరింగ్ వర్క్స్ కాంట్రాక్ట్ సంస్థ
- చర్యలు తీసుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం



నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనదారులు



రోడ్డును ఆనుకుని జరుగుతున్న గెడ్డ ఆధునికీకరణ పనులు



పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సంస్థ కార్మికులు



శివాజీపాలెం మార్గం వైపు నిర్మాణ పనులు

ఎంవీపీ కాలనీ : ఇసుకతోట కూడలి దరి జాతీయ రహదారిపై జరుగుతున్న కల్వర్ట్ నిర్మాణ పనులతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడి గెడ్డపై కల్వర్ట్ నిర్మాణ పనులు చేపట్టేందుకు విశాఖ ఇంజినీరింగ్ వర్క్స్ సంస్థ టెండర్ దక్కించుకుని గత జూన్‌లో పనులు ప్రారంభించింది. అయితే పనులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా పురోగతి మాత్రం నత్తనడకన సాగుతుండడంతో సర్వత్రా ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా ఇసుకతోట పెట్రోల్ బంక్‌ను ఆనుకుని జాతీయ రహదారికి సగ భాగం వరకు గొయ్యి తవ్వేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు భారీగా నిలిచిపోతుండటంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే జాతీయ రహదారికి అనుసంధానంగా జరుగుతున్న పనులు వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీని కారణంగానే రోజురోజుకూ ఇక్కడ ట్రాఫిక్ హైరానా ఎక్కువవుతోందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరం

ఇసుకతోట కూడలి దరి పెట్రోల్ బంక్ ప్రవేశానికి ఇరువైపులా ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. శివాజీపాలెం రోడ్డు వైపు ఒక భాగంగా, పెట్రోల్ బంక్ ఎదుట ఒక భాగంగా పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల కోసం సగం వరకు జాతీయ రహదారిని తవ్వేశారు. జాతీయ రహదారిని ఆనుకుని పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్ట్ సంస్థపై ఉంటుంది. అయితే దానికి భిన్నంగా కాంట్రాక్ట్ సంస్థ పనులు వేగవంతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు సర్వత్రా ఉన్నాయి. దీనికి కారణం మూడు నెలలుగా ఈ పనులు నత్తనడకన సాగుతుండటమే. మూడు నెలలుగా వాహనదారులు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నా జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇరుకు మార్గం కారణంగా ట్రాఫిక్ నిలిచిపోయి నరకయాతన అనుభవిస్తున్నారు. దీనికితోడు శివాజీపాలెం నుంచి పెట్రోల్ బంక్ వైపు రాంగ్‌రూట్‌లో సైతం వాహనాలు వస్తుండటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. దీంతో పనుల నిర్వహణతోపాటు భద్రతా ప్రమాణాలు, సిగ్నల్ బోర్డులు పెట్టడంలో కూడా కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు పనులు వేగంగా పూర్తి చేసేలా కాంట్రాక్ట్ సంస్థపై ఒత్తిడి పెంచాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

రూ.90 లక్షలతో నిర్మాణ పనులు

శివాజీపాలెం నుంచి ఇసుకతోట కూడలి వైపుగా విస్తరించి ఉన్న గెడ్డ ఆధునికీకరణలో భాగంగా జీవీఎంసీ ఈ పనులు చేపట్టింది. దశాబ్దాలుగా ఈ గెడ్డను ఆధునికీకరించకపోవడంతో వర్షం కురిసినప్పుడల్లా పెట్రోల్ బ్యాంక్ సమీపంలో గెడ్డ ప్రవాహం బ్లాక్ అవుతోంది. దీంతో ఆ నీటి ప్రవాహంతోపాటు చెత్త, వ్యర్థాలు రోడ్డుపైకి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గెడ్డకు ఇరువైపులా గోడల **నిర్మాణంతోపాటు పైభాగంలో స్లాబ్ నిర్మాణానికి జీవీఎంసీ జోన్** – 3 ఇంజినీరింగ్ **విభాగం రూ.90 లక్షల** వ్యయంతో పనులు **నిర్వహించేందుకు టెండర్‌**ను పిలిచింది. దీం**తో రెండు భాగాలుగా టెండర్** దక్కించుకున్న **విశాఖ ఇంజినీరింగ్ వర్క్స్** సంస్థ జీఎస్టీ మినహాయింపులు **పోను** సుమారు రూ.70 లక్ష**లతో పనులు ప్రారంభిం**చింది. ఈ పనుల్లో **భాగంగా గ్రౌండ్ లెవల్‌లో** ఐరన్‌తో కూడిన **కాంక్రీట్ నిర్మాణంతోపాటు** గెడ్డకు రెండు **వైపులా ఐరన్‌తో కూడిన** కాంక్రీట్ గోడలు, **పైన స్లాబ్ నిర్మించాల్సి** ఉంది. అయితే **పనులు ప్రారంభించి మూడు** నెలలు గడు**స్తున్నా 20 శాతం కూడా పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.**

ప్రజల వద్దకు కూటమి ప్రభుత్వ మోసాలు



పైనాపిల్‌కాలనీలో ప్రభుత్వ మోసాలు వివరిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని పైనాపిల్ కాలనీలోని బూత్ నంబరు 3 పరిధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు వివరించారు. చంద్రబాబు పాలనలోని వైఫల్యాలపై వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఏవిధంగా పరిపాలన సాగిస్తుందో వివరించారు. కాలనీల్లో అభివృద్ధి పనులు కూడా చేపట్టకుండా వదిలేస్తున్నారని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయకుండా ఇష్టానుసారంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రశ్నించే వారిని రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి నాయకులు పోలీసుల సాయంతో అరెస్ట్ చేయిస్తున్నారని ఆరోపించారు. పాలనంతా అరాచకం, మోసంతో సాగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాండ్రింకి శ్రీను, కొల్లూరు సుబ్బారావు, ఆల్తి బంగారమ్మ, తోట డేవిడ్, కడగల కృష్ణంరాజు, పైడిపునాయుడు, రాము, భాస్కర్, వంకర బాబూరావు, ప్రసంగి వాసు, బేత దుర్గారావు, పోలరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు

మద్దిలపాలెం : స్త్రీ శక్తి పథకం అమలులో ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, తదితరులు తీసుకెళ్లారు. సెక్రటేరియట్‌లో మంత్రిని గురువారం కలిసి తమ సమస్యలు చెప్పారు. ఏపీ పీటీడీ ఉద్యోగుల ప్రమోషన్ ఫైల్‌కు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపినప్పటికీ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి జీవో ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. జీవో జారీ చేయించడంతోపాటు ఏపీపీటీడీ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు. మంత్రిని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, పీవీ మోహన్, అనంతరాములు, వినోద్‌కుమార్, కేసీహెచ్ మోహన్ కలిశారు.

పోటీతత్వంతోనే వ్యక్తిత్వ వికాసం



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు డిబేట్, డ్యాన్స్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలు పెంచుకుంటారన్నారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రభుత్వ కళాశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కేఎల్ శిరీష, బి.రాధమ్మ, విజయ ప్రశంస, జి.జ్యోతి ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ





నగరంలో చెత్తను తరలించే వాహనాల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర రోడ్లను శుభ్రంగా ఉంచాల్సిన ఈ వాహనాలే అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. చెత్తను తరలించే క్రమంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో లారీలలోని చెత్త నుంచి దుర్వాసనతో కూడిన నీరు రోడ్లపై కారుతోంది. ఫలితంగా శుభ్రంగా ఉన్న రహదారులు సైతం దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఈ సమస్య వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి, చెత్త తరలింపు వాహనాల నిర్వహణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నవంబర్ 28న ఏయూలో సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ ఫార్మాసిటికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచితో కలిసి నవంబర్ 28న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, వి.గిరిజా శాస్త్రి, ఎమ్.మురళీకృష్ణ కుమార్, పి.శైలజ, అరుణ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన 2 గంటల్లోనే బాలుడి ఆచూకీ లభ్యం



కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: తప్పిపోయిన మూడున్నరేళ్ల బాలుడిని రెండు గంటల్లోనే వన్‌టౌన్ పోలీసులు వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు గురువారం అప్పగించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తన సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టౌన్ కొత్తరోడ్డుకు చెందిన నాయుడు తన భార్యతో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నాడు. వీరి మూడున్నరేళ్ల కుమారుడు రిత్విక్‌రాజ్‌తో కలిసి బయటికి వెళ్లేందుకు గురువారం ఉదయం వచ్చారు. ఈ క్రమంలో రిత్విక్ వారి నుంచి తప్పిపోయాడు. తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జీడీ బాబు స్పందించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తెప్ప ధ్వంసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు



పెదజాలరిపేట తీరంలో ధ్వంసమైన తెప్ప

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 19వ వార్డు జాలరి ఎండాడకు చెందిన ఈదల రాము తెప్పను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై మత్స్యకారులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 17వ తేదీ సాయంత్రం రాముతోపాటు పలువురు మత్స్యకారులు వేటకు వెళ్లి వచ్చిన తర్వాత తెప్పను జాలరి ఎండాడ తీరంలో లంగరు వేశారు. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తెప్పతోపాటు వలను కూడా తీరం వెంబడి లాక్కుని వెళ్లి ధ్వంసం చేశారు. గురువారం ఉదయం రాముతోపాటు పలువురు మత్స్యకార్యులు ధ్వంసమైన తెప్పను పెదజాలరిపేట తీరంలో గుర్తించారు. తెప్పను పూర్తి నాశనం చేయడంతోపాటు వలను సైతం ముక్కలుగా కోసి సముద్రంలో పడేశారు. దీంతో ఈ ఘటనకు కొందరు కారకులంటూ రాము తదితరులు ఎంవీపీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపించారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య శిబిరాల పరిశీలన



పిఠాపురంకాలనీ యూపీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం పరిశీలించారు. ఎం.ఎస్.ఆర్. పట్టణ ఆరోగ్య కేంద్రం, పిఠాపురం కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిఠాపురం కాలనీలో సిబ్బంది, వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, సికిల్ సెల్ అనీమియా, పోషణపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. డాక్టర్ బి.ఉమావతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటపాటలతో బోధించాలి



ప్రతిభ కనబరిచిన బాల్యం విద్యార్థులతో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, తదితరులు

డాబాగార్డెన్స్: బాల్యం కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్‌ను ఆదేశించారు. గురువారం జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జీవీఎంసీ బాల్యం విద్యార్థులను కమిషనర్ అభినందించారు. ఈ నెల 7న జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన మల్కాపురం, చెంగలావుపేట బాల్యం కేంద్రాల్లోని నాలుగేళ్లలోపు విద్యార్థులు కారే హరి లిశిక, డోమనా గ్రీష్మ ఆంగ్ల పద్యాల కేటగిరీలో విజేతలుగా నిలిచారని, ఆర్‌పీ పేట, ప్రగతినగర్ బాల్యం కేంద్రంలోని నాలుగేళ్ల చిటికెల హాన్విక, పిల్లి ప్రణతి ఫ్యాన్సీ డ్రెస్ కేటగిరీలో విజేతలుగా నిలిచారని, వీరికి ఢిల్లీలోని చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ నిర్వాహకులు మెడల్స్, షీల్డ్స్, ధ్రువీకరణ పత్రాలు అందించారని కమిషనర్ పేర్కొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్ హెచ్.శంకర్రావు, బాల్యం ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నగరంపాలెం శ్మశాన వాటిక నుంచి తరలిపోతున్న గ్రావెల్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులో మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం గ్రావెల్‌ను అక్రమంగా తరలించడంపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఇచ్చినట్టు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగపడేదే అయినా, దీని కోసం నగరంపాలెం శ్మశాన వాటిక ప్రహరీని ఆనుకుని ఉన్న గ్రావెల్ తవ్వేయడం సరికాదని పేర్కొన్నారు. దీనివల్ల ప్రహరీ పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి గ్రావెల్ తవ్వకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కోరారు. ఒకవేళ అనధికారికంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లయితే తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.